# అసమర్థుని ప్రేమలేఖ

మామిళ్ళపల్లి వేణుగోపాలశర్మ

"సుమిత్రా!

నీవు ఇవ్వని చనువు తీసుకొని, 'ప్రియమైన' అనో, 'డార్లింగ్' అనో నిన్ను సంబోధించలేను. అలాగని నా మనసు కించపరచుకొనేంత గౌరవం అంటగట్టి నన్ను నేను చిన్నబుచ్చుకోలేను. అందుకే నిన్ను నిన్నుగా 'సుమిత్రా!' అనే పిలుస్తున్నాను. నిన్ను నేను ప్రేమిస్తున్నాను. కావాలనుకుంటున్నాను. ఒక యువకుడు నిన్ను ప్రేమించి కావాలనుకోవడం, ఇలా ప్రేమలేఖ వ్రాయడం నీవొక నేరంగా భావిస్తే అందుకు తగిన శిక్ష విధించు! చెయ్యి గలిగినంతా చేసేయ్!

అలా కాని పక్షంలో వచ్చే ఆదివారం సాయంత్రం ఆరుగంటలకు నౌబత్‌పహాడ్ పైకి రా! ఎడారిలాంటి నా జీవితాన్ని నందనవనం చేస్తావో లేక నన్ను పిచ్చివాడిని చేస్తావో నీ యిష్టానికే వదలుతున్నాను. నన్ను అనుగ్రహించు సుమిత్రా!

—నీ వాడు కావాలనుకునే చంద్రలాల్.

○ ○ ○

ఆదివారం సాయంత్రం - ఆరుగంటల సమయం. సాధారణంగా ఆ సమయంలో నౌబత్ పహాడ్ రకరకాల జంటలతో కన్నులపండువుగా వుంటుంది. అంత ఎత్తునుంచి చూస్తే కనిపించే నగరదృశ్యం అపూర్వం.

ఆనాడు ఆదివారమే అయినా అంత సందడి లేదు. వాతావరణంలో చలి అధికమే కాకుండా మబ్బుకూడా పట్టివుంది. నాలుగ్గంటల ప్రాంతంలో చిన్న జల్లుకూడా పడడంతో మనుషులు పది పదిహేనుమంది కంటే ఎక్కువ లేరు.

ఒక యువతి బెంచిపై కూర్చొని ఎదురుగా కనిపించే పబ్లిక్ గార్డెన్స్ చూస్తూంది. ఆకుపచ్చని చెట్లమధ్య తెల్లగా అందంగా వుంది అసెంబ్లీ హాలు. మనుషులూ, వాహనాల తాలూకు హడావుడి పైనుంచి చూస్తే అతి ప్రశాంతంగా వున్నట్లనిపిస్తూంది.

"సుమిత్రా!"

ఆమె తనను పిలిచిన వ్యక్తివైపు చూసి, "రండి! కూర్చోండి! మీ కోసమే ఎదురు చూస్తున్నాను!" అంది చిన్నగా నవ్వుతూ. "చూశారా! మీరే ఆలస్యం చేశారు!"

"నువ్వు ... రావనుకున్నాను" అంటూ ఆమెకు కాస్త ఎడంగా కూర్చున్నాడు.

"ఏం! ఎందుకలా అనుకున్నారు!"

అతను క్షణంసేపు మాట్లాడలేదు. "నువ్వు అందమైనదానివి! మంచి ఉద్యోగంలో ఉన్నావు. నువ్వు పెళ్ళాడాలనుకుంటే నన్ను మించినవారెందరో వున్నారు" నసుగుతూ నిదానంగా అన్నాడు.


"మరి ఆ ఉత్తరమెందుకు వ్రాశారు? ఈ మాట చెప్పడానికేనా?"

"కాదు సుమిత్రా! ఎంత అభాగ్యుడైనా ఒక లాటరీ టికెట్టు కొని తన అదృష్టం పరీక్షించుకోవా లనుకుంటాడు. నేను కూడా...."

అతని మాటలు పూర్తికాకుండానే ఆమె కిలకిలా నవ్వింది.

"నేను లాటరీ టికెట్టునా? అయితే నా విలువ వేలా? లక్షలా? చెప్పండి!"

అతనుకూడా నవ్వాడు. బెరుకు వదలి సర్దుకుని కూర్చున్నాడు. తడబడకుండా మాట్లాడగల ధైర్యం వచ్చినట్లుంది.



"నిజం చెప్పనా? మన సాహచర్యం ఒక్క క్షణంలోనిది కాదనిపించింది. ఆత్మీయులమైన మన మధ్య అడ్డు వున్నట్లనిపించింది. అది ఛేదించాలని విలవిలలాడిపోయాను. ధైర్యంచేసి ఉత్తరం వ్రాసాను. తీరా నీ ఎదట పడేసరికి సూటిగా మాట్లాడలేకపోయాను. ఏమిట

కారణం?"

"నన్నే అడుగుతున్నారూ! బావుంది! బహుశా తొలి ప్రేమయ్యుంటుంది."

"తొలి ప్రేమా? ఒక్కొక్కళ్లు ఎన్నిమార్లు ఎందరిని ప్రేమిస్తారేమిటి?"

"ఈ రోజుల్లో కొందరికి ఇదొక హాబీ అయ్యింది. తమ కందనివాళ్ళను ప్రేమించాననడం. బెడిసికొడితే జూనియర్ దేవదాసుల పోజు కొట్టడం—"

"సుమిత్రా! నువ్వు నాకు బుద్ధి చెప్పడానికి రాలేదు కద....?"

"ఎందుకలా ఉలిక్కిపడతారు? ఇష్టం లేకపోతే రావద్దని వ్రాశారుగా!"

"అయితే మరి...."

"నమ్మలేకపోతున్నారా?"

"అవును! నిజంగా నా అదృష్టాన్ని నమ్మలేకపోతున్నాను!"

"అది నాపై మీరేర్పరచుకొన్న అభిమానపు విలువ."

"ఎంత చక్కగా మాట్లాడతావు సుమిత్రా! నీవు నా కందడం జీవితానికొక వరం. మనసులోని పారవశ్యం గిలిగింతలు పెడుతూంటే కవిత్వం పొంగుతూంది."

"అబ్బ! సుపర్బ్! ఎవరైనా వినడంలేదు గదా! ఔట్ డోర్ షూటింగనుకొనేరు!"

"నీ ముందు తారలుకూడా..."

"చాలు మహాశయా! ఆపండి! అసలు విషయానికి వద్దామిక! మీరు నా వ్యక్తిత్వాన్ని మన్నించి, నా ఆలోచనలను గౌరవించగలరా? ఇద్దరికీ సంబంధించిన ఇంటి విషయాలతో నేను సూచించిన ప్లాను ప్రకారం నడువగలరా?"

"నిరభ్యంతరంగా. నన్ను బాగా పరిశీలించు సుమిత్రా! తొందరేమీలేదు. బాగా అర్థం చేసుకున్నాకే పెండ్లాడుదాం."

"మీకు తొందరలేకున్నా నాకుంది సార్! పరిశీలనలూ - అర్థం చేసుకోడం అంటూ కొన్నాళ్ళపాటు మీతో విహరించలేను. అంత ఓపికా-తీరికా లేవు. నేను స్ట్రెయిట్ ఫార్వర్డ్! టూ ఫ్రాంక్. ఆఫీసులో చూస్తున్నారుగా! ఇప్పుడిక్కడ ఆఫీసువ్యక్తు లెవరు చూసినా నేనొక ప్రేమ వ్యవహారం నడుపుతున్నా ననుకోరు. మీరు చెప్పినా నమ్మరు. అందుక్కారణం నా సిన్సియారిటీ! నాకు గల ఆత్మవిశ్వాసం. అవతలివారికి నాపై గల నమ్మకం. నేనేది చేసినా తెలివితక్కువగా చేయననే నమ్మకం నాపై నాకుండాలి. అప్పుడే తలెత్తుకు తిరగగలను. ఏమంటారు?"

"నీ సాహచర్యంలో నా విలువా - గౌరవం పెరుగుతాయంటాను. నిన్ను నేనెప్పుడూ గౌరవిస్తాను. అది నన్ను నేను గౌరవించుకున్నట్లుగా భావిస్తాను."

"గుడ్! మీరు నాకు నచ్చారు! కానీ...ఇది ప్రేమ-నిషా కాదు గదా?"

"అబ్బ! సుమిత్రా! నిన్నెలా నమ్మించను?"

"నమ్మించింది చాలు! నాపై మీకేర్పడిన ప్రేమనూ, నమ్మకాన్నీ సడలకుండా చూసుకోండి! నేను మిమ్మల్ని నడిపిస్తాను, సుఖపెడతాను..."

"సుమిత్రా!!" ఆనందంతో తల మునకలయ్యాడతను.

○ ○ ○

సరిగ్గా తొమ్మిది గంటలకు వచ్చిన జగన్నాథం, ఆఫీసుకి తనకన్నా ముందు వచ్చి కూర్చున్నవారందరివంకా ఒక్కసారి చూశాడు. అందరిలోనూ ఓ మాదిరి కుతూహలం పెరిగింది. అందరూ అతనివేపు మ్యాజిక్ చేసే మెస్మరిస్టును చూసినట్లు చూడసాగారు.

"మీ కందరికీ ఓ శుభవార్త!" అన్నాడతను.


"ఏమిటది?" కొన్ని కంఠాల ఆర్తనాదం!

"ఊరికే చెప్పదలచుకోలేదు. తలకొక పాతిక పైసల రుసుం మాత్రమే!"

"అయితే దాచుకో." రత్నం విసురుగా అనేశాడు.

"ఓ యస్! దాచుకుంటాను. కానీ విషయం సుమిత్రా స్వయంవరాన్ని గురించి! నిమిషానికో పైస చొప్పున రేటు పెరుగుతుంది. ఆ తర్వాత






మీ యిష్టం!"

క్షణాల్లో అందరిలోనూ 'థ్రిల్' పెరిగింది. అందరికన్న ముందు రత్నం వెళ్ళి జగన్నాథం టేబుల్‌మీద పావలాబిళ్ళ పడేసి తిరిగి అందరికేసీ చూశాడు. జగన్నాథం టేబుల్‌పై మూడు రూపాయల చిల్లర పేరుకుంది. అవి తాపీగా జేబులో వేసుకుని జగన్నాథం అందరివంక సమదృష్టితో చూస్తూ అన్నాడు.

"సుమిత్ర వివాహం నిశ్చయమైంది;"

"ఆ!" "వరుడెవరు?" "పెళ్లెప్పుడు?"

"ఇది నిజమై వుండదు!" ఒక్కొక్క పావలాకూ ఒక్కొక్క ఆక్రోశం.

"వివరాలకు మరో పాతిక పైసలు!"

"బాబ్బాబు! జగన్నాథం! టిఫిన్ కోసం తెచ్చుకొన్నది మొత్తం వసూలుచేసి మా కడుపు కొట్టకు నాయనా!" అన్నాడు భాస్కర్రావు.

"డియర్ భాస్కర్రావ్! కాఫీ టిఫిన్ కావాలంటే అరువైనా దొరుకుతుంది. కానీ విషయంలో 'సస్పెన్స్' వస్తే మళ్లీ దొరకదు. పోనీ పావలా వద్దు. పది పైసలు చాలు. అన్ని వివరాలూ చెబుతాను. బాస్ వచ్చాడంటే ఫినిష్. సుమిత్రగానీ వస్తే నేను నోరు తెరిచే వీలుండదు" అన్నాడు జగన్నాథం 'త్వరగా తేల్చుకోమన్నట్లు' చూస్తూ! తప్పదన్నట్లుగా ఒకరి ముఖాలు ఒకరు చూసుకుంటూ తలా పది పైసలు యిచ్చుకున్నారు.

"ఇదిగో చూడండి! ఈ ఉత్తరం నాకు సుమిత్ర టేబుల్ క్రింద దొరికింది. ఏమిటోనని తీసి చూద్దును గద! ప్రేమలేఖ! అయినా నమ్మలేక చంద్రరావు సుమిత్రను రమ్మని వ్రాసిన చోటికి వెళ్లాను. ఇద్దరూ కలుసుకున్నారు. కబుర్లాడుకున్నారు. మీకు ఈ మసాలా అందించాలన్న కుతూహలంతో నేను జేమ్సుబాండ్ 007 కన్నా కష్టపడ్డాను." అంటూ వివరంగా చెప్పేశాడు జగన్నాథం.

"సుమిత్ర చంద్రరావుని పెళ్ళాడుతుందా?"

"రామచంద్రా!"

"జగన్నాథం! నీవు వేళాకోళమాడడంలేదు కదా!" ఇంకా ఆశ చావలేదు.

"అక్షరాలా నిజం! కొద్దిరోజుల్లోనే వాళ్ళు తమ వివాహానికి మనల్ని ఆహ్వానిస్తారు. ఇది అబద్ధమైతే ఇంతకు రెట్టింపు యిచ్చుకుంటాను. నిన్న రామకృష్ణా థియేటర్లో వాళ్ళిద్దర్నీ యీ కళ్ళతో చూశాను" అన్నాడు జగన్నాథం.

"కోతి మొహం వెధవ! వాడెక్కడ దొరి కాడు అన్నాడు, తను హీరో కావలసినవాడిననీ, అదృష్టం వక్రించి ఈ ఆఫీసులో పడ్డాననీ, ఏనాటికైనా తను జీవితంలో వెలిగిపోతాననీ ఆశలు పెంచుకుంటున్న భాస్కర్రావ్.

"ఆ ఉసూరుమియ్యా ఏ ధైర్యంతో వప్పు కున్నా డసలు" రత్నం ఉవాచ.. అతను స్పోర్ట్స్‌మన్. కండబలం వున్న తమిళ సోద రుడు. అతని ప్రక్కన నిలబెడితే ఉష్టి బొమ్మలా వుంటాడు చంద్రరావు.

మొత్తంమీద అందరి హృదయాలూ బరు వెక్కాయి. ఎవరికి వాళ్ళు తమ స్వంత ఆస్తి ఏదో నష్టమైపోయిన ఫీలింగు పెట్టారు.

మరో పావుగంటలో వచ్చింది సుమిత్ర. అందర్నీ పేరు పేరునా పలకరించి 'గుడ్ మార్నింగ్' చెప్పింది.

"హల్లో జగన్నాథంగారూ! ఎలా వుంది సినిమా? చంద్రరావుగారి నడిగితే ఇంగ్లీషు సినిమా తన కర్థం కాదన్నారు. చిన్నబుచ్చు కోటం నా వంతయింది" అన్నది.

ఆ మాటతో అందరికీ పూర్తిగా సందేహం తీరిపోయింది.

"నిజమే! చంద్రరావుకి అంతగా ఇంగ్లీషు రాదు. ఆ[illegible] అప్పుడప్పుడు యిబ్బంది పడుతుంటా[illegible]" అన్నాడు జగన్నాథం.

"మీరు [illegible] సుమిత్రగారూ!" భాస్కర్రావు.

"తప్పుతు[illegible] [illegible]! ఆయన కింగ్లీషు రాకుంటే నాకు డామ్ ఇన్సల్ట్!"

"సుమిత్ర గారూ... నేనొక విషయం విన్నాను... నిజమేనా?" రత్నం అడిగాడు.

"నా పెళ్ళి గురించే అయితే యూ ఆర్ కరక్ట్! అసలు కార్డ్సు ప్రింటయ్యేదాకా ఎవరికీ చెప్పకూడదనుకున్నాను. నేను చంద్రరావు గారిని పెళ్ళాడబోతున్నాను.

"బాగా ఆలోచించుకున్నారుగా! పెళ్ళంటే వెయ్యేళ్ళ పంట!"

"నిజమే విశ్వేశ్వర్రావుగారూ! అందుకే బాగా ఆలోచించే నిర్ణయించుకున్నాను. నా పెళ్ళిని మీరంతా ఆమోదించి హృదయపూర్వ కంగా ఆశీర్వదించాలి!"

"సర్టెన్లీ! ష్యూర్! తప్పకుండా!" అనక తప్పలేదెవరికీ.

ఇంతలో మెల్లగా చంద్రరావు వచ్చాడు. అంతా చంద్రరావుని చుట్టుముట్టారు. అభినంద నలు వరుసగా ప్రారంభమయ్యాయి.

"అదృష్టవంతుడివోయ్!" "కంగ్రాట్యు లేషన్స్!" "లక్కీఛాన్సు కొట్టేశావ్!"

చంద్రరావు ముందు కంగారుపడి సుమిత్ర తన వంక నవ్వుతూ చూస్తూ కనిపించేసరికి నిలదొక్కుకొని "థాంక్స్!" అన్నాడు.

"అవి చాలవు మిత్రమా! పార్టీ ఇవ్వాలి."

"అదంతా ఆమె యిష్టం!"

"ఐపొయ్యాడు. మనవాడు ఆమె వాడ య్యాడు. అప్పుడే గీచిన గీటు దాటలేని వాడయ్యాడు!"

"అసలు అటుండా వుండాల్సిందిప్పుడే నోయ్!"


"తర్వాత అవసరం లేదా?"

"ఎందుకు లేదు? కాని ఆ గీటు దాటినప్పు డల్లా పెనాల్టీగా ఏదో నజరానా సమర్పించు కోవాలి" అందరూ నవ్వుకున్నారు.

ం ం ం

లంచ్ అవర్ దాకా ఈ విషయం నిద్ర పోయింది. లంచ్ టైం కాగానే పీడకల నుండి వులిక్కిపడ్డట్లు హఠాత్తుగా మేల్కొంది. సుమిత్రా చంద్రరావులు జంటగా బయటి కెళ్ళారు. అరగంట తర్వాత తిరిగి వచ్చేసరికి స్టాఫ్ అంతా ఒకచోట చేరి చర్చించుకుంటు




మా ఆవెడ త్వరగా కొంపజేరమంది– నేవాకౌట్ జేయడం తప్పనిసరి గురుడా!!

న్నారు. వీళ్ళను చూసి అంతా బుద్ధిమంతుల్లా ఎవరి సీట్లల్లో వాళ్ళు కూర్చున్నారు. సుమిత్ర తనలో తాను నవ్వుకుంది. టైప్ మిషన్ ముందు వెళ్ళి కూర్చోబోతూ వుండగా హెడ్ క్లర్కు శ్రీనివాసులుగారు ఆమెను పిలిచారు.

"అమ్మాయ్ సుమిత్రా! ఒక్క మాట!" ఆమె లేచి వెళ్ళింది.

"ఏమిటి సార్?"

ఆయన చిన్నగా నవ్వుతూ ప్రారంభిం చారు, "చూడమ్మాయ్! మాకు తెలిసిన ఉద్యో గస్థురాలు పెళ్ళాడబోతూంది. ప్రజెంటేషన్‌గా ఏమిస్తే బాగుంటుంది?"

"ఏమిచ్చినా బాగానే వుంటుంది. నిండు మనసుతో వెళ్ళి ఆశీర్వదించినా సంతోషిస్తుంది."

"సంతోషానికేంలే! ఆఫీసులో వాళ్ళంతా తెగక తలలు ఒద్దలు కొట్టుకుంటున్నారనుకో!"

"పాపం! నిజంగా అంత యివ్వాలనివుంటే ఒక గ్యాస్ స్టవ్వో, కుక్కర్లో యివ్వండి.. తూగ గలిగితే రెండూ యివ్వండి. ఉద్యోగం చేస్తుం డింటున్నారు గదా? పెందలాడే వంటా వడ్డనా తెమల్చుకొని బయటపడే అవకాశముంటుంది."

"గుడ్ అయిడియా! కుక్కర్ పరవాలేదు గానీ గ్యాస్‌స్టౌ మాత్రం ముందుగా బుక్ చెయ్యా ల్సుంటుంది అబ్బాయిలూ!"

"ఎవరికి చెబుతున్నారు సార్?"

"బహుమతి యివ్వాలనుకునే వారికి– సుమిత్రా! ఇంతకూ నేను విన్నది....నిజమేనా? లేక వీళ్ళందర్నీ ఫూల్స్ చేయాలనుకున్నావా?"

ఆమె నవ్వి "ఏం విన్నారు!" అంది.

"నీ పెళ్ళి సంగతి."

"నిజమే నండి నేనూ చంద్రరావు గారూ పెళ్ళి చేసుకోబోతున్నాం."

ఇంతలో చంద్రరావూ. సుమిత్రలకు ఆఫీ సరు గార్నుంచి పిలుపు వచ్చింది. తన పెళ్ళి వార్తతో ఆఫీసు వాతావరణమంతా ఏదో విడ్డూరం జరగబోతున్నట్లు ఆశ్చర్యాంబుధిలో మునగడం సుమిత్ర గమనిస్తూనే వుంది.

ఇద్దరూ వెళ్ళి నమస్కరించగానే కుర్చీలు చూపించారు ఆఫీసరుగారు.

"పరవాలేదండీ" అని వారన్నా వినలేదు. తప్పనిసరిగా కూర్చున్నారు. తను తెప్పించు కున్న స్పెషల్ కాఫీ ఇద్దరికీ సర్వ్ చేశారు స్వయంగా.

"మిమ్మల్ని పిలిపించింది ఆఫీసు విషయంలో

కాదు!"

ఇద్దరూ ముఖాలు చూసుకొని తర్వాత ఆయనగారి వైపు చూశారు.

"నేను విన్నది నిజమే అయితే మిమ్మల్ని అభినందించడం తొందరపాటు కాదనుకుంటాను" ఆఫీసరుగారి ఉపోద్ఘాతంతో విషయం పూర్తిగా అర్థమయింది.

"నిజమే సార్!" "థాంక్యూ సర్!" సుమిత్రా, చంద్రలావు ఒక్కమారే అన్నారు.

సుమిత్ర భర్తగా తన కంతకంతకూ విలువ పెరగడం గమనిస్తూనే వున్నాడు చంద్రలావు. ఆనందం పెరగడంతో పాటు వ్యక్తిత్వంలో ఏదో వెలితి కూడా పొడుతూంది. లోగడ తనను నిర్లక్ష్యంగా అందరికన్నా చివరిమెట్టుపై నిలబడిన వాణ్ని చూసినట్లు చూసేవాళ్ళు—ఆ వెధవలు—ఉన్నట్టుండి తనను హీరోగా చూస్తున్నారు. మామూలు హీరో కాదు. ఈ వెధవలు, ఈ నల్లులు, ఈ దోమలు...అని మండి పడబోయి యెదురుగా వున్న ఆఫీసరుగారిని చూసి తమాయించుకున్నాడు.

"సుమిత్రా నిన్ను ప్రత్యేకంగా అభినందిస్తున్నాను!" అని "చంద్రలావ్! సుమిత్ర నిన్నంగీకరించిందంటే యెవరిలోనూ కనిపించని ఒక ప్రత్యేక తాను నీలో గుర్తించిందన్న మాట!" అన్నాడు.

చంద్రలావు లోపల యేమనుకున్నాడో గానీ ఒక చిరునవ్వు బదులిచ్చి వూరుకున్నాడు.

"కానీ ఒక్క మాట! సుమిత్ర నాకు ఐదారు సంవత్సరాలుగా బాగా తెలుసు. చాలా అభిమానవంతురాలు పట్టుదల గలది. బంధువుల ఇండ్లలో పెరిగి రకరకాల మనస్తత్వాలనూ, పరిస్థితులనూ యెదుర్కొని చాలా అనుభవాన్ని జీర్ణించుకొంది, టైపిస్టుగానే పని చేస్తూ, ఈవెనింగ్ కాలేజీలో బి. ఏ. పూర్తి చేయబోతూంది. అందుకే ఆమెపై నాకు తండ్రిలాటి అభిమానముంది. నువ్వామెను అర్థం చేసుకొని ప్రవర్తించి ఆమె నీలో వూహిస్తున్న ప్రత్యేకతను ఋజువు చేసుకోవాలి. ఇలా చెప్పినందుకు యేమీ అనుకోకు. నాకు రేపో, ఎల్లుండో ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స్ రాబోతున్నాయి. అందుకే చెప్పాలనుకున్నది చెప్పేశాను."

"మా పెళ్ళివరకూ వుండరా సార్!" సుమిత్ర అభిమానంతో అడిగింది.

"చెప్పలేను!"

చంద్రలావుకు ముఖమంతా చెమట పట్టింది.

"సో! యంగ్ కపుల్! విష్‌యూ ఏ హేపీ మ్యారీడ్ లైఫ్ ఇన్ అడ్వాన్స్!" అన్నాడు.

"థాంక్యూ సర్!" ఇద్దరూ ఒకేసారి అన్నారు. ఉత్సాహంగా బయటకు నడిచారు.

○ ○ ○

తనలోని అందమూ, ఆకర్షణా, పురుషుల నెలా వెర్రెత్తిస్తాయో యెరుగనిది కాదు సుమిత్ర. తనతో మాట్లాడాలనీ, స్నేహాన్నీ, చనువునూ పెంపొందించుకోవాలనీ ఎందరు ఎంతగా ప్రయత్నిస్తున్నారో కూడా తెలుసు! కానీ ఎవరూ సాహసించి తనను సమీపించలేక పోయారు. అది తనకు గర్వకారణమే అయినా రానురానూ కొంత చింతను కూడా రేపింది. ఏమిటిది? చేయి తగిలితేనే పారవశ్యంతో తలక్రిందులై పోయే ఈ యువకులెవ్వరూ తన్ను కావాలనుకోరేం? తన జీవితంతో పాలు పంచుకుందా మనుకోరేం? పురుషులను పిరికివారిని చేసేటంత 'విపరీత శక్తి' తనలో లేదుగద?

ఆమె ఇలా ఆలోచించి మథనపడే సమయంలో చంద్రలావు వ్రాసిన ప్రేమలేఖ వచ్చింది. ఆ లేఖలో నిజంగానే అతని మంచి మనసు కనిపించింది. నిజంగా చంద్రలావు అందగాడు కాడు. ఎవరితోనూ, ఏ ప్రమేయమూ లేనట్లు ప్రత్యేకంగా వుంటాడు. అది పిరికితనమో—అవతలివారిపట్ల తృణీకారమో అర్థంకాదు. ఆఫీసులో యీనాటివరకూ సుమిత్ర విషయం కూడా అందరిలా పట్టించుకోనిది ఒక్క చంద్రలావే!

అతనికీ, అతను వ్రాసిన ఉత్తరానికీ ఆమె అంత ప్రత్యేకత యివ్వడానికి అదికూడా ఒక కారణం. తను చంద్రలావుని పెళ్ళాడడం యింత అద్భుతంగా పరిణమిస్తుందని కలలో కూడా అనుకోలేదు.

○ ○ ○

చంద్రలావుకు గంగ వెర్రులెత్తినట్లుంది. అందరూ తనను ప్రత్యేకంగా జూకు వచ్చిన కొత్త మృగాన్ని చూసినట్లు చూస్తున్నారు. ముఖ్యంగా ఆఫీసరుగారు సుమిత్రను అభినందించిన తీరు "చంద్రలావు, నీ ప్రక్కన నిలబడడానికి కూడా తగడు" అన్నట్లుంది.

సుమిత్ర మాత్రం చాలా అసాధారణ స్త్రీగా తనతో వ్యవహరిస్తూంది. ఏవేవో చెబుతుంది. మొన్నొకమారు "మనమొక పదివేలు కూడబెట్టేదాకా పిల్లల్ని కనకూడదు" అంది. "ఒకరి జీతమే వాడుకోవాలి! రెండవవారిది నిలువ చేయాలి" "ఊరికే దుబారా చేయకూడదు. చాలా పొదుపు చేయాలి!" ఇలా ఇంకేవేవో అంది. అతనికి విసుగెత్తింది. ఏమిటీమె! సరదాగా బయటికి వచ్చినప్పుడు ఇంకే విషయాలూ మాట్లాడకుండా ఒకటే నస! పెళ్ళి ముగ్గురు పిల్లల తల్లిలా మాట్లాడుతుంది. ఏ మాట మాట్లాడినా దానికి వెనకాల డబ్బుకు సంబంధించిన లంకె వుంటుంది. దానితో అతని 'మూడ్' చెడిపోతుంది కొంపతీసి ఆమె వ్యక్తిత్వాన్ని నిరూపించుకోడానికి తన వ్యక్తిత్వాన్ని మరుగున పడవేయదు కదా?

○ ○ ○

ఆఫీసరుగారి బదిలీ సందర్భంలో స్టాఫంతా ఆయనకు 'తాజ్‌మహల్' హోటల్లో చక్కటి విందు చేశారు. ఆయనగారు రేపే మరో వూళ్ళో జాయినవ్వాలి. అప్పుడే తన కుటుంబాన్నంతా ఆ వూరికి పంపించారు.

విందు దివ్యంగా జరిగింది. ఆఫీసరు వెంకటేశంగారూ, శ్రీనివాసులుగారు, సుమిత్రా, చంద్రలావులు వరుసగా కూర్చున్నారు. బల్లలు మధ్యన పేర్చి చుట్టూ కుర్చీలు వేశారు. 'బట్లర్సు' అతి వినయంగా సర్వ్ చేస్తున్నారు.

విందు పూర్తవగానే ఆఫీసరుగారు కాస్సేపు ప్రసంగించారు. వచ్చే క్రొత్త ఆఫీసరుగారు నవ్వయువకుడనీ, విదేశాలుకూడా వెళ్ళివచ్చారనీ చెబుతూ ఆఫీసు విషయాల్లో శ్రద్ధచూపించి ఆయనకు సహకరించమన్నారు. చివర్లో కాబోయే దంపతులను ఆశీర్వదిస్తూ చంద్రలావు అదృష్టాన్ని మరోమారు పొగిడారు. ఇద్దరినీ అభినందించారు.

స్టాఫ్ ఒక్కొక్కరు శెలవు తీసికొని వెళ్ళిపోయాక శ్రీనివాసులుగారినీ, సుమిత్రా, చంద్రలావునీ తన యింటికి తీసికెళ్ళారు ఆఫీసరుగారు. 'లాన్' లో కుర్చీలు వేయించారు. హోదాలు మరచిపోయి కలివిడిగా కబుర్లల్లో పడ్డారు.

"వివాహం క్లుప్తంగా జరగాలి" అంది సుమిత్ర.

"ఆ! అంతే తిరుపతి వెళ్ళిరావటం!—రాగానే సత్యనారాయణ వ్రతం" అంటూన్న చంద్రలావు మాటలు పూర్తికాక మునుపే సుమిత్ర అందుకుంది.

"ఎందుకూ! దేవుడికెక్కడనుండే మనస్ఫూర్తిగా నమస్కారం చేస్తే పోలా? అనవసరమైన దుబారా ఎందుకూ! సత్యనారాయణ వ్రతం కూడా దండుగే—నాకు మానవశక్తి మీదే యెక్కువ విశ్వాసం. ఈ ప్రపంచంలో ప్రతిదీ దైవసృష్టే అయినప్పుడు ఆయనది ఆయనకు యివ్వడమే అవుతుంది కదా? అందుకే హృదయపూర్వకంగా సమర్పించే ఒక్క నమస్కారాన్నే అన్నింటినీ మించిన వ్రతంగా భావిస్తాను నేను!"

చంద్రలావుకేమీ నచ్చలేదు. మిగిలిన ఇద్దరూ "బాగా చెప్పావమ్మా!" అని ఒకరూ, "ఎక్సలెంట్ థాట్" అని మరొకరూ పొగిడారు.

సుమిత్ర కళ్ళలో గర్వంతో కూడిన మెరుపు మెరిసింది.

"పెళ్ళికూడా రిజిస్ట్రారాఫీసులో పది

రూపాయల లోపుగా జరిగితే మంచిది." అన్నది సుమిత్ర.

"పురోహితుడుకూడా లేకుండా...!" నసిగాడు చంద్రరావు.

"మీరు అన్నిట్లో నన్ను వ్యతిరేకిస్తున్నారు" అన్నట్లు నిష్ఠూరంగా చూసిందామె.

"పోనీ అమ్మాయ్! పెళ్లికొడుకైనా, పెళ్లివారైనా అతనొకడేగా!" శ్రీనివాసులుగారు.

"అంతే! అంతే!" వెంకటేశంగారి సమర్థింపు.

చంద్రరావుకు సుమిత్ర ఒక బుర్రకథ చెబుతున్నట్లు మిగిలిన యిద్దరూ 'తందాన తాన' అంటూ వంత పాడుతున్నట్లు తోచింది. అతని అంతర్యంలో యిదమిద్ధమని చెప్పలేని ఒక నైరాశ్యం తలెత్తింది.

ం ం ం

కొత్త ఆఫీసరుగారి రాకవల్ల ఆఫీసులో కొత్త వాతావరణం నెలకొంది. మెల్లగా నడుస్తున్న రైలుబండి స్పీడ్ అందుకున్నట్లయింది. ఆయన గారిపూర్తిపేరేమిటోగానీ యస్. యస్. మిత్ర ఆనే పేరుతో వ్యవహరిస్తున్నారు. నవయువకుడు. అందంలో ఆరోగ్యంతో మిసమిసలాడుతూ వున్నాడు. ఏమయితేనేం ఆయనగారి ఉనికితో ఆఫీసుకి కొత్త హంగు వచ్చిందని ఒప్పుకోక తప్పదు.

వచ్చిననాడే స్టాఫ్ అందరికీపంక్చుయాలిటీని పాటించమని చాలా స్ట్రిక్టు ఆర్డర్స్ యిచ్చారు. బల్లలు, కుర్చీలు అలాకాదు యిలా అంటూ కొత్తవరుసలో మార్పించారు. ఆ మార్పుల్లో ముఖ్యమైనది సుమిత్ర సీటూ మిగనూ ఆఫీసరుగారి ఎయిర్ కండిషన్ గదిలోకి మారడం. రెండువారాలు దాటకుండానే మిస్టర్ మిత్ర సుమిత్రకు పనితనంలోను, పంక్చుయాలిటీలోను విధేయతలోనూ "ఏ" రాంక్ యిచ్చి వేశారు. సుమిత్ర ఆయనకు నచ్చింది లంచ్ వర్‌లో కేకుతో కాఫీటిఫిన్లు ఆఫీసరుగారితోపాటు వచ్చేవి.

మిత్రగారు దేశదేశాల వింతలూ, విశేషాలు వినసొంపుగా సుమిత్రకు చెప్పేవారు. అక్కడి జనులవేషధారణ, ఆహారవ్యవహారాలూ, సోషల్ మూవింగ్, నైట్‌క్లబ్బులూ వగైరావిశేషాలు భావావేశంతో వివరిస్తుంటే ఆమెకెంతయినానవ్వు వచ్చేది. ఎంతనిగ్రహించుకొన్నా కొంతయినా బయటపడేది.

"ఆపకు! హాయిగా నవ్వేసెయ్! పొంగి పొరలే ఆనరదాన్ని నిరోధించావంటే జీవితంలో ఉత్సాహాన్ని చంపేశావన్నమాటే!" అనేవాడు మిత్రా.

నెల తిరక్కుండా ఇద్దరిమధ్యామంచి స్నేహ యేర్పడింది. అయితే ఒక కొత్త చిక్కువచ్చి పడింది' ఆఫీసరు గదిలోకి వెళ్ళే తలుపుకులద్దం వుంది, శబ్దం వినిపించదుకానీ లోపలి దృశ్యం కనిపిస్తుంది. ఆ నిశ్శబ్ద దృశ్యాలకు బయటివారు కొత్త రూపకల్పన చేసి ఒకకావ్యం అల్లేశారు.

ం ం ం ం


సుమిత్ర ఎదురుగా ఎవర్నూ ఏమీ అనలేదు గానీ, చంద్రరావు పరిస్థితి మాత్రం చాలా జాలి పడేలా మారిపోయింది. అతన్నికూడాయెవరూ యేమీ అనరు. కానీగుసగుసలు. అతనురాగానే ఆపేయడం-అతన్ని సానుభూతి పూర్వకంగానే హేళనగానో చూడడం!- అయ్యోపాపం! అనే భావం ముఖాల్లో చూపడం. దీనివల్ల అతనికి పిచ్చి ఎత్తినట్లయింది.

ఆఫీసులో అల్లిన "కావ్యం" అతని చెవిదాగా వచ్చింది. ఆఫీసరు గది తలుపులోంచీ కనబడే దృశ్యానికి అతనూ ఒక ప్రేక్షకుడే! సుమిత్రను ముఖాముఖీ అడిగి తెలుసుకోలేడు. ఊరుకునే విషయం అంతకన్నా కాదు. తమ వివాహం నిశ్చయమైంది గనుక తప్పకుండా తేల్చుకోవాలి.

ం ం ం ం

పొగమేఘాలు సృష్టిస్తూ మిత్రగారుసుమిత్ర టేబుల్‌చుట్టూ ఒక ప్రదక్షిణం చేశారు "చూడు సుమిత్రా! ఆ కాగితాల్లో నేను డిక్టేట్ చేసింది కాకుండా అదనంగా కొంతచేర్చాలి" అంటూ






ఆమె భుజం మీదుగా వంగి టైప్ చేసే కాగితాలవంక చూడసాగాడు.

"ఫారిన్ సెంటు" వాసన మత్తుగా తాకింది "సార్! ఏమన్నా సజెషన్స్ ఇవ్వాలంటే నేనే మీటేబుల్ దగ్గరకు వచ్చేదాన్నిగా! మీకెందుకు శ్రమ? "అంటూ సీట్‌లోంచి లేచిందామె.

"నామూడ్ చెదిరిపోయింది" అంటూ నిట్టూర్చాడు మిత్రా.

ఆమె ఆయన వంక చూసింది. 'ఏమిటీ బుద్ధి! హాయిగా పెళ్ళి చేసుకోగూడదూ! ఆవేశం పట్టలేని యవ్వనాన్ని బజార్ల పాలుచేసి పిప్పి అయిన చెరకులాంటి ముది వయస్సులో గృహలక్ష్మిని గాలిస్తారు వీళ్ళు!. ఆ తరువాత పంచవర్ష ప్రణాళిక దాటీ దాటకుండానే హార్ట్ ఎటాక్స్, మధుమేహాలూ, డాక్టర్లూ-మందులూ."

"ఏమిటాలోచిస్తున్నావ్?"

ఆమె మాట్లాడలేదు. ఆయన కళ్ళలోని కాంక్షను, ప్రవరనలోని కంగారును చూస్తే నవ్వు వచ్చింది. మిత్రాగారు నవ్వుకు లైసెన్సు ఏనాడో ఇచ్చేశారు గనుక ఫక్కున నవ్వేసింది. ఇద్దరిమధ్యా యేర్పడిన స్నేహమూ, చొరవా మూలంగా అంతస్తూ, భయమూ మొదలైనవి కలుగకపోగా ఆయన్ను మంచితనంతోనే దారికి తేవచ్చుననుకొంది.

సుమిత్ర నవ్వుచూసి మిత్రాగారు కాస్త చొరవ చేశారు. తన వేడి శ్వాసను ఆమె మెడకు తగిలేలా వెనుకగా వచ్చి నిలబడి "సుమిత్రా!" అని పిలిచారు.

ఆమె ఆయన్ని చూసి కొంత ఆశ్చర్యం

అరువు తెచ్చుకొని "ఏమిటి సార్! ఎందుకలా అనుకున్నారు మీరు? డాక్టరు కెవరికయినా ఫోన్ చేసేదా?" అంది.

మిత్రా నెమ్మదిగా అన్నాడు "ఈ క్షణంలో నువ్వే నా డాక్టరువు."

"ఆ మరుక్షణంలో— నేనెవరు?" ఆమె మాటలతో పూర్తిగా చలించిపోయాడు.

"నువ్వు నా దేవతవు! ఏ క్షణంలోనయినా నేను ఆరాధిస్తాను. అసలు నేనింతకాలమూ నీలాంటి యువతికోసమే గాలిస్తూ వివాహాన్ని వాయిదా వేస్తూ వచ్చాను. నువ్వు ఒప్పుకుంటే...."

"కానీ సార్! నా వివాహం నిశ్చయమైంది. చంద్రలావుగారిని చూశారుగా! ఆయనే నా కాబోయే భర్త!"

"విన్నాను. విని భరించలేకపోయాను. అతను నిన్ను భరించలేడు."

ఆమె రోషంతో "ఏ ఆధారంతో మీరీ జోస్యం చెబుతున్నారు?" అన్నది.

"ముఖం చూస్తూనే అతని మనస్తత్వం తెలుసుకున్నాను."

సుమిత్ర ఏదో అనబోయింది. ఇంతలో డోర్ చప్పుడయింది. అద్దం అవతలినుంచి చంద్రలావు ముఖం కనిపించింది. లోపల దృశ్యాన్ని చూశాడో ఏమో ఆఫీసరు అనుమతితో ప్రమేయం లేకుండానే సాహసించి లోనికి వచ్చేశాడు. సుమిత్ర తన సీటులో కూర్చుంది. మిత్రాగారు సిగరెట్ 'ఆష్ ట్రే'లో పడేశారు. చంద్రలావు ఆఫీసరుతో తన పని ముగించుకొని సుమిత్రకేసి అదోలా చూస్తూ నెమ్మదిగా వెళ్ళిపోయాడు.

సందర్భాన్ని మార్చే ఉద్దేశంతో సుమిత్ర టైపుచేసిన కాగితాలను రిఫర్ చేసుకోసాగింది.

"నేను కనిపెట్టాను" మిత్రాగారు హఠాత్తుగా అన్నారు.

"ఏం కనిపెట్టారు?"

"అతను ఒట్టి అనుమానపు మనిషి! ఆ చూపు చూశావా! నీవు నమ్మలేకపోతే అతను నిన్ను కలుసుకున్నప్పుడు ఈ సంఘటనకి ఎలాంటి కలరిస్తాడో చూడు! దాన్నిబట్టి నువ్వే ఆలోచించుకో!"

"అందులో ఆశ్చర్యమేముంది సార్! ఇందాక ఏస్థితిలో చూశాడు చెప్పండి! నేను మీ టేబుల్ దగ్గర నిలబడితే ఆశ్చర్యం లేదు కానీ మన మిద్దరమూ మన సీట్లు వదిలి ప్రత్యేకగా నిలబడి మాట్లాడవలసిన ఆఫీసు వ్యవహారం యేముంటుంది? అతని అనుమానానికి కావలసిన దృశ్యాన్ని మనం చూపించేం."

"సారీ సుమిత్రా! అతన్ని పిలిచి ఏమీ లేదని చెప్పెయ్యనా?"

"దయచేసి ఆ పని మాత్రం చేయకండి. తప్పకుండా ఏదో వుందనే అనుకుంటాడు. నిజానికి మన మధ్య ఏముంది? నాకిష్టంలేని పదార్థం మీరు 'ఆఫర్' చేశారనుకోండి. నాకది సరిపడదని చెబుతాను! ఇప్పుడూ అంతే జరిగింది."

"నువ్వెంత మంచిదానివి సుమిత్రా!"

"మీరింతటి ఆఫీసరు ఎలాగయ్యారు సార్! మీ తెలివితేటల వెనుక వున్న అమాయకత్వం చూస్తే ఆశ్చర్యం వేస్తుంది."

"అయినా నా అంతటి దురదృష్టవంతుడుండడు. నీ పరిచయంతో, స్నేహంలో వెదకబోయిన తీగ కాలికి తగిలిందనుకున్నాను. కాని ఏం లాభం! నీ పెళ్ళి నిశ్చయం కాకమునుపు నేను వచ్చివుంటే యెంత బావుండేది! నాకింతే జరగాలి! ఈ శిక్ష కావలసిందే!" మిత్రాగారు చిరాగ్గా జుత్తు పీక్కున్నారు.


సుమిత్ర కంగారు పడింది. "ఎవరన్నా చూస్తే బావుండదు. ఈ సంఘటన వల్ల మీరు నాకు సన్నిహితులయ్యారు. మనం మంచి స్నేహితులం" అంది.

"ఎందుకొచ్చిన స్నేహం! అలా అనుకొని తృప్తి పడలేను!"

"మిమ్మల్ని చూస్తే నాకు బాధగానే వుంది.







కానీ ఏంచేయను చెప్పండి ఇలాంటి బలహీన క్షణాలు ఎదురవుతాయనే నీతి నియమాలంటూ సమాజం కొన్ని హద్దులేర్పరిచింది."

"ఒక్క కోరిక—చివరి కోరిక!"

"ఏమిటది?"

"నేనిలా అంటున్నాననుకోకు. చంద్రలావు నిన్ను దక్కించుకోలేడని గ్యారంటీ పత్రం వ్రాసిమ్మన్నా యిస్తాను. అటువంటి సమయంలో, నీ జీవితంలో నిరాశ, ఒంటరితనం యెదురైన ఏక్షణంలోనైనా నన్ను గుర్తుంచుకో! నా దగ్గరకు రా! చంద్రలావుతో నీకు వివాహం జరిగినా ఆ బంధం మనమధ్య అవరోధం కాదు. మంచి మనసుతో మంచి మిత్రుడిగా నిన్ను అర్థిస్తున్నాను సుమిత్రా!"

సుమిత్ర రెండు క్షణాలు ఏమీ మాట్లాడలేదు ఆ తర్వాత మౌనంగా మిత్రాగారిని సమీపించి అంగీకార సూచకంగా తల ఊపింది.

○ ○ ○

"పిల్లి కళ్ళు మూసుకుని పాలు త్రాగుతూ ఎవరూ తనను చూడడం లేదనుకుంటుందట! సుమిత్రా! నేనేం పసివాడిని కాదు. నన్ను మభ్యపెట్టలేవు నువ్వు!" చంచంద్రలావు కఠినంగానే అన్నాడు.

"అలా అనకండి! పాపం ఆయన చాలా అమాయకుడు."

"అమాయకుడేం?" — చంద్రలావు పళ్ళు కొరికాడు. "ఆ అందమైన ముఖం చూసేసరికి మతి పోయింది నీకు! రాజును చూసిన కళ్ళతో మొగుణ్ణి చూసినట్లుంది నీకు!"

"అంత అసహ్యంగా మాట్లాడకండి. కేవలం అందం చూస్తేనే మతిపోయేదాన్నయితే మీ చక్కదనం చూసే ఒప్పుకున్నానా మిమ్మల్ని?" సుమిత్ర నెమ్మదిగాదే అడిగింది.

"ఔను. నేను అందగాడిని కాను, కానీ నీ కొక తెరచాటు—మొగుడనే లైసెన్సు కావాలి. అందుకే యేరి కోరుకున్నావు నన్ను!"

"ఛీ! మీకెలా చెప్పాలో కూడా తోచడం లేదు. మీకంత అనుమానమైతే నన్ను చిత్రవధ చేయండి. మాట్లాడను. కానీ నిముషానికొకరు వచ్చే ఆఫీసరు గదిలో నేనేమో చేశానన్న అరోపణ మాత్రం చేయకండి! పోనీ ఉద్యోగం మానేయమంటే ఆ మాట చెప్పండి. మానేస్తాను."

"అదొక ఆయుధముంది నీకు! నా జీతం తక్కువని ఎత్తిపొడుపు!"

"కాదు. కానేకాదు" సుమిత్ర అరిచింది. "ఉద్యోగం చేసే భార్య విషయంలో ఈ రకం ధృక్పథాన్ని పెంచుకోకూడదు మీరు."

"ఏం చేసినా యెలా వున్నా సహించాలా?" అక్కసుతో ప్రతిపలికాడు.

"ఏం చేశాను నేను?"

"ఏమీ అర్థం కానట్టు నటించకు! అసలు నీ సీటు ఆయన గదిలో యెందుకు?"

"నేను స్టెనోను. ఆయన ఆఫీసరు తనక."

"డిక్టేట్ చేసింది బయట టైపు చేయ కూడదా? మీ గదిలో నేనొక్కర్తెను, కూర్చో వడం యిష్టం లేదని ఆయనతో స్పష్టంగా చెప్పొచ్చుగా? పాత ఆఫీసరుగారున్నంతవరకు అలా సాగలేదా?"

"ఆ ఆఫీసరు అలా సరిపుచ్చుకున్నాడు. ఈయన స్టెనో తన మాట వినిపించేంత దూరంలో వుండాలనుకున్నాడు."

"అదే! ఎందుకని అడుగుతున్నాను."

"డిక్టేట్ చేస్తుంటేనే టైపు చేయగల మెరిట్ నా దగ్గరుంది గనుక. అర్జంటు అవసరాలలో ఉపయోగపడుతుందని."

"అవును! నీ మెరిట్‌ను బాగా గుర్తించా డాయన."

"అలా ద్వంద్వార్థాలతో మాట్లాడకండి! ఎవ రన్నా వింటే అసహ్యంగా వుంటుంది."

"చూస్తే వుంటదేం? అందరూ ఏమను కుంటున్నారో ఒక్కమారు విను."

"వాళ్ళు రోగ్స్! మిమ్మల్నే ఏరికోరి యెన్ను కున్నానని జెలసీ."

"నువ్వు చమత్కారంగా మాట్లాడగలవు. అదే నీ ధీమా!"

"ఏదైనా కానీయండి" ఆమె నిశ్చలంగా అంది. "ఈ విషయాన్నింకా సాగదీస్తే నేను సహించలేను. ఒక్కటిమాత్రం గుర్తించండి! మీ ఆలోచన నిజమైన పక్షంలో మిమ్మల్నింతగా దేవిరించాల్సిన అవసరం నాకు లేదు."

సుమిత్ర చివరి మాట చంద్రలావుపై ఎలా పనిచేసిందో కాని అప్పటికేమీ మాట్లాడలేదు.

○ ○ ○

మరునాడు సుమిత్ర ఆఫీసుకి వచ్చేసరికి ప్యూన్ ఆమె చేతికి ఒక కవరిచ్చి "చంద్రలావు గారు మీ కివ్వమన్నారమ్మా" అని చెప్పాడు.

సుమిత్ర ఉత్తరం తీసి చదివింది. ముఖంలో పెద్ద మార్పేమీ లేదు, "అయ్యగారున్నారా?" అని ప్యూన్నడిగింది. అత్యవసర పరిస్థితుల్లో మిత్రాగారు టైంకన్నా ముందు రావడం మామూలు విషయమే!

"ఉన్నారమ్మా! ఏదో ట్రంక్‌కాల్ బుక్ చేసి ఎనిమిదింటినుంచి దానికోసం ఎదురు చూస్తున్నారు" అన్నాడు.

ఆమె మరేమీ అనకుండా తన చేతిలోని ఉత్తరాన్ని ఉండగా నలిపి విసురుగా నేలకేసి కొట్టి రాయంచలా అడుగులు వేసుకుంటూ మిత్రాగారి గదిలోకి వెళ్ళింది.

అప్పుడే వచ్చిన జగన్నాధం ఆమె ఉత్తరా న్నలా నలిపి విసిరి వెళ్ళిపోవడం చూసి గబు క్కున జాగ్రత్తగా విడదీసి చదివాడు.

సుమిత్రా!

నీవు యిచ్చిన చనువును. యివ్వబోయిన సాహచర్యాన్ని నేను అంగీకరించలేక పోతున్నం దుకు క్షమించు. నా మనసు ఒప్పుకోని పని చేసి, మనయిద్దరి జీవితాలనీ సంఘర్షణ పాలు చేయలేను.

అందుకే నన్ను మర్చి పొమ్మని స్నేహ పూర్వకంగా కోరుతున్నాను. ఇదే మనకిద్దరికీ మంచిది. నేను నిన్ను భరించలేను. నన్ను నువ్వు సహించలేవు. ఇప్పటివరకూ జరిగింది "మనిద్దరి మంచికే" అని నీవు తలచే పక్షంలో నాకొక ఉప కారం చెయ్యి.

నేను నెలరోజులు సెలవు పెడుతున్నాను. ఆ సెలవులోపల నాకు ట్రాన్స్‌ఫర్ కావాలి. అలా కాని పక్షంలో నేను నా ఉద్యోగాన్నే వదలుకో వలసి వస్తుంది.

"జెలసీ ఈజ్ ఎ డెవిల్! నేను నిన్ను చూస్తూ దూరంగా వుండలేను. దగ్గరగా రాలేను. నీ శుభం కోసం, నన్ను నేనే నమ్మలేక నీకు దూరంగా వెళుతున్నాను నన్ను క్షమించ గలిగితే ఈ దూరాన్ని మరింత దూరంగా-అక్షయంగా చేయ డం నీ బాధ్యత- మరిచి పోకు.

నీ హితుడు

చంద్రలావ్" *





